రామడుగు ప్రాజెక్టును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అంకిత్

ఒక గేట్‌ను ఎత్తి అలీసాగర్ రిజర్వాయర్ నుంచి నీటిని వదులుతున్న దృశ్యం

అలుగు పారుతున్న బోధన్ బెల్లాల్ చెరువు

అలుగు పారుతున్న వల్లభాపూర్ చెరువు

ఎడతెరిపిలేని వాన

- నిండుతున్న చెరువులు.. పారుతున్న అలుగులు
- పలుచోట్ల కూలిన ఇండ్లు..ధ్వంసమైన రోడ్లు
- ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలు

నీటమునిగిన ఉమ్మెడ ఉమామహేశ్వరాలయం

పొతంగల్ వద్ద మంజీరా నదిలో వరద ఉధృతి

నమస్తే తెలంగాణ యంత్రాంగం/ సెప్టెంబర్ 2 : జిల్లావ్యాప్తంగా శనివారం రాత్రి నుంచి సోమవారం మధ్యాహ్నం వరకు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి ప్రజలు ఇండ్లకే పరిమితమయ్యారు. భారీ వర్షంతో చెరువులు నిండి, అలుగులు పారుతున్నాయి. వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. వర్షానికి రోడ్లపై వర్షపు నీరు నిలవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలు చోట్ల పురాతన ఇండ్లు కూలిపోయాయి.

నిండుకుండల్లా చెరువులు.. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు

డిచ్‌పల్లి మండలంలోని సుద్దపల్లి, అమృతాపూర్, ముల్లంగి, జక్రాన్‌పల్లి మండలంలోని పడకల్ పెద్ద చెరువులు నిండి, అలుగులు పారుతున్నాయి. ప్రజలు అలవైపుగా వెళ్లవద్దని డిచ్‌పల్లి తహసీల్దార్ ప్రభాకర్‌రావు సూచించారు. ఇందల్వాయి పెద్ద చెరువు, సిర్నాపల్లి, ఎల్లారెడ్డిపల్లి, మాందాపూర్ చెరువులు అలుగు పారుతున్నాయి. మెగ్యా నాయక్ తండాలో పురాతన పెంకుటిల్లు కూలినట్లు తహసీల్దార్ వెంకట్‌రావు తెలిపారు. కోటగిరి మండలంలో 13 పాత ఇండ్లు పాక్షికంగా కూలాయి. కొత్తపల్లిలో రెండు కుటుంబాలను పాత ఇంట్లో నుంచి సురక్షిత ప్రాంతానికి తరలించారు. మోస్రా మండల కేంద్రంలో ప్రత్యేకాధికారి రమేశ్ పరిస్థితిని పర్యవేక్షించారు.

మొన్నటివరకు నీరు లేక ఇసుక దిబ్బలతో దర్శనమిచ్చిన పొతంగల్ మండలంలోని మంజీరా నది.. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జలకళను సంతరించుకున్నది. పొతంగల్, హంగర్గ ఫారం, సుంకిని, కొడిచర్లలో ఒక్కో ఇల్లు, కొల్లూర్‌లో రెండు ఇండ్లు పాక్షికంగా కూలిపోయాయని తహసీల్దార్ మల్లయ్య తెలిపారు. కొల్లూరు-దోమలెడ్గి వాగు వద్ద బ్రిడ్జి పనులు కొనసాతున్న నేపథ్యంలో పక్క నుంచి మొరంతో తాత్కాలిక రోడ్డు ఏర్పాటు చేశారు. పరిస్థితిని ఏసీపీ శ్రీనివాస్, సీఐ జయేశ్‌రెడ్డి, ఎస్సై సందీప్ పర్యవేక్షించి, బారికేడ్లు ఏర్పాటు చేశారు. సిరికొండలో విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ప్రజలు, మత్స్యకారులు చెరువులు, వాగుల వద్దకు వెళ్లవద్దని సిరికొండలో ఎస్సై రామ్ ఆధ్వర్యంలో, చందూర్‌లో పోలీసు సిబ్బంది ఆటో, మైక్‌తో ప్రచారం చేయించారు. చందూర్ మండలకేంద్రంలో ఎంపీడీవో నీలావతి, ఎంపీవో మధురిమ పర్యటించారు. శిథిలావస్థకు చేరిన ఇండ్లలో ఉంటున్న వారిని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. రుద్రూర్ మండలం రాయకూర్ సబ్‌స్టేషన్ పరిధిలో తీగలపై చెట్లు పడడంతో తీగలు తెగిపోయాయి. మరమ్మతులు చేయించినట్లు లైన్‌మన్ శివ తెలిపారు. జక్రాన్‌పల్లి మండలంలోని బాలనగర్ కాలనీలో గుడిసెల్లో ఉంటున్న 12 కుటుంబాలను తహసీల్దార్ కిరణ్మయి ఆధ్వర్యంలో సిబ్బంది ప్రభుత్వ పాఠశాలలోని పునరావాసానికి తరలించారు. మోపాల్ మండలం బాడ్సి బ్రిడ్జి వద్ద పిచ్చిమొక్కలను అధికారులు తొలగింపజేశారు. మోపాల్ మండలంలో అధికారులు సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నగరంలోని మాలపల్లి, అర్సపల్లి, సారంగపూర్ రోడ్ తదితర ప్రాంతాల్లో రోడ్లపై వర్షపు నీరు నిలిచింది.

బోధన్ మండలంలోని మంజీరా పరివాహక ప్రాంతంలోని హంగర్గా గ్రామాన్ని తహసీల్దార్ విఠల్, బోధన్ ఏసీపీ శ్రీనివాస్ సందర్శించారు. లోతట్టు ప్రాంతంలో నివాసం ఉంటున్న ప్రజలను సురక్షిత ప్రాంతానికి తరలించాలని కార్యదర్శి జహీర్‌కు సూచించారు. బోధన్ మండలం ఖండ్‌గామ్ నుంచి కొండల్‌వాడికి వెళ్లే మహారాష్ట్ర రోడ్డును అధికారులు మూసివేశారు.

బోధన్ ప్రజలకు తాగు, సాగు నీరు అందించే బెల్లాల్ చెరువు అలుగు పారుతోంది. తట్టికోట్‌కు వెళ్లే రహదారిలో కల్వర్టు కూలిపోగా పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. పట్టణంలో పారిశుద్ధ్య పనులను మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గణేశ్ పర్యవేక్షించారు. నవీపేట మండల కేంద్రంలోని ధర్మపూర్‌లో బుడ్డ నాగన్నకు చెందిన నివాసపు పెంకుటిల్లు కూలిపోయింది. యంచ, అల్జాపూర్‌లో ఇండ్లు కూలి పోయాయి. యంచ నవీపేట తదితర గ్రామాల్లో మూడు ఇండ్లు పాక్షికంగా దెబ్బ తిన్నాయని డిప్యూటీ తహసీల్దార్ తెలంగ్‌రావు తెలిపారు.

నందిపేట్ మండలం ఉమ్మెడ ఉమామహేశ్వరుని ఆలయం గోదావరిలో మునిగింది. శివాలయం గంగమ్మ ఒడిలోకి వెళ్లిందని, తిరిగి మళ్లీ పవిత్రమైన శివరాత్రి రోజు ఆలయం భక్తులకు దర్శనమిస్తుందని గ్రామస్తులు తెలిపారు. డొంకేశ్వర్ మండల కేంద్రంలోని మాసం చెరువు అలుగును మండల ప్రత్యేకాధికారి జగన్నాథచారి, ఎంపీడీవో శ్రీనివాస్‌రావు పరిశీలించారు.

మాక్లూర్ మండలంలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు 66.4మిమీ వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ శేఖర్ తెలిపారు. మోర్తాడ్, కమ్మర్‌పల్లి మండలాల్లోని చెరువులు నిండుకుండల్లా మారి, అలుగుపారుతున్నాయి. కమ్మర్‌పల్లి మండల అమీర్‌నగర్ శివారులో రోడ్డు కోతకుగురై రాకపోకలు నిలచిపోయాయి. గాండ్లపేట్ శివారులో పంటలు నీటమునిగాయి. కమ్మర్‌పల్లిలో లోతట్టు ప్రాంతంలో ఉన్న ఇండ్లచుట్టూ వర్షపునీరు చేరింది. బాల్కొండ మండలం కిసాన్‌నగర్ నుంచి బస్సాపూర్ వెళ్లే దారిలో పంటలు నీటమునిగాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై నరేశ్ పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఆటో ద్వారా మైక్‌లో ప్రచారం చేయించారు.

భీమ్‌గల్ మండలంలోని ముచ్కూర్, సిరికొండ మండలం నర్సింగ్‌పల్లి గ్రామాల మధ్య ఒర్రె ప్రమాదకరంగా పారుతోంది. రెండు గ్రామాల మధ్య రాకపోకలకు నిలిచిపోయాయి. ప్రజలు అటువైపు వెళ్లకుండా తహసీల్దార్ షబ్బీర్, ఎస్సై మహేశ్ ట్రాక్టర్లను అడ్డంగా పెట్టించారు. పురాణిపేట్ చెన్న చెరువు కట్టకు గండి పడడంతో తహసీల్దార్, ఎస్సై పూడ్చి వేయించారు. కోతకుగురైన భీమ్‌గల్ మండలంలోని పల్లికొండ -బాచన్‌పల్లి రోడ్డును ఎంపీడీవో సంతోష్‌కుమార్ పరిశీలించారు. వేల్పూర్ నుంచి రామన్నపేట్ దారిలో రోడ్డు తెగిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. వాగులు, చెరువు వైపు వెళ్లకూడదని తహసీల్దార్ సంతోష్, ఎస్సై నాగనాథం తెలిపారు. రెంజల్ మండలంలో గోదావరి నీటి ప్రవాహాన్ని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజేద్‌హుస్సేన్, ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ పరిశీలించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ ఎస్సై సాయన్న ఆటో ద్వారా ప్రచారం చేయిస్తున్నారు. ఆర్మూర్ మండలంలోని ఖానాపూర్, కోమన్‌పల్లిలో శిథిలావస్థలో ఉన్న ఇండ్లలోని కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించినట్లు ప్రత్యేక అధికారి రాజగంగారాం తెలిపారు.

ముప్కాల్‌తో పాటు నాగంపేట్‌లోని ఊర చెరువును మండల ప్రత్యేక అధికారి స్రవంతి, ఎంపీడీవో మహ్మద్ ముజాఫరుద్దీన్, ఎంపీవో మహమ్మద్ గౌస్ పరిశీలించారు.

రామడుగు ప్రాజెక్టును పరిశీలించిన అదనపు కలెక్టర్

ధర్పల్లి, సెప్టెంబర్ 2 : ధర్పల్లి మండలంలోని రామడుగు ప్రాజెక్టు పూర్తిగా నీటి నిండడంతో అలుగును అదనపు కలెక్టర్ అంకిత్ సోమవారం పరిశీలించారు. అనంతరం వాడి గ్రామం వద్ద వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి తాత్కాలిక వంతెన కొట్టుకుపోగా పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఎంపీడీవో బాలకృష్ణ, తహసీల్దార్ మాలతికి సూచించారు.

మరో రెండు రోజుపాటు భారీ వర్షాలు

ఖలీల్‌వాడి, సెప్టెంబర్ 2 : జిల్లావ్యాప్తంగా మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురవనున్నట్లు వాతావరణ శాఖ అధికారులు సూచించారు. దీంతో అధికారులు అప్రమతమయ్యారు.

ఆర్మూర్ మండలంలోని ఇస్సాపల్లికి వెళ్లే రహదారిలో..

మత్తడి దూకుతున్న మౌలాలి రిజర్వాయర్

సారంగాపూర్, సెప్టెంబర్ 2 : మండలంలోని మల్కాపూర్ తండా శివారులో ఉన్న మౌలాలి రిజర్వాయర్ మత్తడి దూకింది. మూడు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు ఎగువ భాగంలో ఉన్న అటవీ ప్రాంతం నుంచి వరద భారీగా వచ్చి చేరడంతో రిజర్వాయర్ నిండుకుండలా మారి జలకళను సంతరించుకున్నది. ఆయకట్టు కింద సాగవుతున్న సుమారు 600 ఎకరాల పంటలకు ఢోకా లేదని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సబ్‌స్టేషన్‌ను పరిశీలించిన సీజీఎం

సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న సీజీఎం అశోక్‌కుమార్

సిరికొండ,సెప్టెంబర్ 2 : మండలకేంద్రంలోని 33/11కేవీ సబ్‌స్టేషన్‌ను సీజీఎం (వరంగల్) అశోక్‌కుమార్ పరిశీలించారు. సబ్‌స్టేషన్ చుట్టూ నీరు నిలిచి సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు గుర్తించారు. నీరు నిల్వకుడా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

నగరంలో 106 ఇండ్లకు నోటీసులు

కంఠేశ్వర్, సెప్టెంబర్ 2 : జిల్లాలో మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లావ్యాప్తంగా 23 ఇండ్లు పాక్షికంగా ధ్వంసమైనట్లు డీపీవో చక్రవర్తి తరుణ్‌కుమార్ వెల్లడించారు. 93 మందిని పునరావాస కేంద్రాలకు తరలించామని తెలిపారు. పెద్దబజార్‌లోని హనుమాన్ ఆలయం ఎదురుగా ఉన్న ఇలు పాక్షికంగా ధ్వంసమైంది. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో శిథిలావస్థకు చేరుకున్న 106 ఇండ్లను గుర్తించి, నోటీసులు అందజేశామని, కంట్రోల్ రూంకు 8 ఫిర్యాదులు అందాయలని టీపీవో సత్యనారాయణ తెలిపారు.

భారీ వర్షంలోనూ విద్యుత్ మరమ్మతులు

ఖలీల్‌వాడి, సెప్టెంబర్ 2 : నగరంలోని పవర్ హౌస్‌లో విద్యుత్ సమస్యలు తలెత్తగా.. భారీ వర్షంలోనూ సిబ్బంది మరమ్మతులు చేపడుతున్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా మరమ్మతులు చేపడుతున్నట్లు ఏడీ తోట రాజశేఖర్ తెలిపారు.

కోటగిరిలో పాక్షికంగా కూలిన పాత ఇల్లు

సిరికొండ మండలం బాసన్‌నూతి తండా వంతెన వద్ద ధ్వంసమైన రోడ్డు

బోధన్ మండలం ఖండ్‌గామ్ నుంచి మహారాష్ట్ర వెళ్లే రోడ్డును మూసివేసిన పోలీసులు, అధికారులు

కందకుర్తి శివారులో నీట మునిగిన సోయాపంటలు

కిసాన్‌నగర్ గ్రామం నుంచి బస్సాపూర్ వెళ్లే దారిలో నీటమునిగిన పంటలు

డొంకేశ్వర్ మండలంలోని మారంపల్లి గ్రామంలో..

మాక్లూర్ మండలం చిల్లీ శివారులో ఉధృతంగా ప్రవహిస్తున్న పులాంగ్ వాగు

అప్రమత్రంగా ఉండాలని ఘన్‌పూర్‌లో ప్రచారం చేస్తున్న పోలీసులు

చందూర్‌లో పరిస్థితిని పర్యవేక్షిస్తున్న ఎంపీడీవో నీలావతి

మోస్రాలో కూలిన ఇంటిని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి రమేశ్

ఘనంగా ఎడ్ల పొలాల అమావాస్య

బోధన్ మండలం కల్దుర్కి గ్రామంలో హనుమాన్ ఆలయానికి బసవన్నలను ఊరేగింపుగా తీసుకువస్తున్న రైతులు

సుభాష్‌నగర్/ కోటగిరి/ పొతంగల్/ రుద్రూర్/ చందూర్/ఖలీల్‌వాడి/ శక్కర్‌నగర్/బోధన్ రూరల్/ఎడపల్లి/రెంజల్, సెప్టెంబర్ 2 : జిల్లావ్యాప్తంగా ఎడ్లపొలాల అమావాస్య పండుగను రైతులు సోమవారం ఘనంగా జరుపుకొన్నారు. రైతులు ఉదయం నుంచే ఎడ్లను రంగులు, ఇతర సామగ్రితో అలంకరించి, పిండివంటలు, బొబ్బెర్లతో చేసిన గుడాలు, బెల్లాన్ని తినిపించారు. సాయంత్రం డప్పువాయిద్యాల మధ్య ఊరేగింపు తీసి, హనుమాన్ ఆలయాల చుట్టూ ఎడ్లను ప్రదక్షిణ చేయించారు. కోటగిరి మండల కేంద్రంతోపాటు ఎత్తొండ, సుద్దులం, రాంపూర్, రుద్రూర్ మండలకేంద్రంతోపాటు అంబం, రాయకూర్, చందూర్ మండలంలోని ఘన్‌పూర్ తదితర గ్రామాల్లో పండుగను నిర్వహించారు. నగరంలోని ప్రగతినగర్ మున్నూరుకాపు కల్యాణ మండపంలో ఎడ్లపొలాల తెలంగాణ మున్నూరుకాపు ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. నాగలి, ఎడ్ల విగ్రహాలకు పూజలు చేశారు. అనిల్‌కుమార్, శ్రీనివాస్, రాహుల్, గంగాధర్‌రావుకు రైతు పురస్కారాలను అందజేసి, సన్మానించారు. బోధన్ పాత గ్రామంలో, మారుతీ మందిరం వద్ద, రాకాసీపేట్ హనుమాన్ మందిరాల వద్ద, ఎడపల్లి, బోధన్, రెంజల్ తదితర మండలాల్లో ఎడ్ల పొలాల అమావాస్యను రైతులు నిర్వహించారు.

సంక్షిప్తంగా..

- **మున్సిపల్ కమిషనర్ పర్యటన -** కంఠేశ్వర్, సెప్టెంబర్ 2 : నగరంలోని ఎల్లమ్మగుట్ట, గూపన్‌పల్లిలో మున్సిపల్ కమిషనర్ మకరంద్ సోమవారం పర్యటించారు. వినాయక చవితి సందర్భంగా వినాయక్‌నగర్‌లోని గణపతులబావిని పరిశీలించి, ఏర్పాట్లపై సిబ్బందికి సూచనలు చేశారు.
- **నీలకంఠేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు-** సుభాష్‌నగర్/ కోటగిరి, సెప్టెంబర్ 2 : శ్రావణమాస చివరి సోమవారం సందర్భంగా జిల్లాకేంద్రంలోని శివాలయాల్లో అభిషేకాలు, అన్నపూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కోటగిరి శివాలయంలో పూజలు నిర్వహించారు. నాగేంద్రపురానికి చెందిన గౌని యాదు, రాము ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.
- **సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ -** డిచ్‌పల్లి, సెప్టెంబర్ 2 : మండలంలోని మిట్టాపల్లికి చెందిన 12 మందికి మాజీ ఎంపీపీ కంచెట్టి గంగాధర్ సోమవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. రూ. 7 లక్షల విలువ చేసే చెక్కులను అందజేసినట్లు తెలిపారు.
- **అమ్మ అనాథాశ్రమానికి సరుకుల అందజేత** – కోటగిరి, సెప్టెంబర్ 2 : మండలకేంద్రంలోని అమ్మ అనాథాశ్రమంలో చిన్నారుల కోసం నెలరోజులకు సరిపడా బియ్యంతో పాటు నిత్యావసర సరుకులను కోటగిరికి చెందిన వడ్ల రాజు సోమవారం తన కుమార్తె పుట్టినరోజు సందర్భంగా అందజేశారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అనిల్‌కుమార్ కులకర్ణి, ఆశ్రమ నిర్వాహకురాలు వెంకటరమణమ్మ పాల్గొన్నారు.
- **పవన్‌కల్యాణ్ పుట్టినరోజు వేడుకలు -** కోటగిరి/ సెప్టెంబర్ 2 : ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పుట్టినరోజు వేడుకలను పలు ఆయన అభిమానులు సోమవారం నిర్వహించారు. మండలంలోని కొత్తపల్లిలో ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, కేక్ కట్ చేశారు.
- **వైఎస్సార్‌కు ఘన నివాళి -** కోటగిరి/ వర్ని (రుద్రూర్)/శక్కర్‌నగర్/ నందిపేట్/ ఆర్మూర్‌టౌన్/ముప్కాల్, సెప్టెంబర్ 2: దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ వర్ధంతిని పలు మండలాలు, గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు సోమవారం నిర్వహించారు. ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నగరంలోని కాంగ్రెస్ భవన్‌లో వర్ధంతి నిర్వహించారు. వర్ని మండలం జాకోరాలో కాంగ్రెస్ నాయకులు చిన్నారులకు పలకలు పంపిణీ చేశారు. బోధన్ పట్టణంలోని ఆచన్‌పల్లి శివారులో పెగడపల్లి క్రాస్‌రోడ్డులో దివంగత నేత వైఎస్సార్ వర్ధంతి నిర్వహించారు. నందిపేట్, ఆర్మూర్ పట్టణం, ముప్కాల్ మండల కేంద్రంతో పాటు మండలంలోని వేంపల్లి, వెంచిర్యాల్, కొత్తపల్లి, నల్లూర్, నాగంపేట్ గ్రామాల్లో వైఎస్ఆర్ వర్ధంతిని నిర్వహించారు.
- **విద్యుత్‌షాక్‌తో పాడి గేదె మృతి -** వినాయక్‌నగర్, సెప్టెంబర్ 2 : నగరంలోని ఎల్లమ్మగుట్ట ప్రాంతంలో విద్యుత్ షాక్ తగిలి సోమవారం ఓ పాడి గేదె మృతిచెందింది. ఎల్లమ్మగుట్టలోని న్యాలం పెద్ద ఒడెన్న అనే రైతుకు చెందిన గేదె సోమవారం పూలాంగ్ వాగు పక్కన ఉన్న వెంచర్ దగ్గర మేతమేసేందుకు వెళ్లగా.. పక్కన ఉన్న ఎలక్ట్రిసిటీ వైరు తగలడంతో అక్కడికక్కడే మృతిచెందింది. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే తన గేదె మరణించిందని, విచారణ చేపట్టి, తనకు న్యాయం చేయాలని బాధిత రైతు కోరాడు.
- **ఎల్ఐసీ ఆవిర్భావ దినోత్సవం -** కంఠేశ్వర్, సెప్టెంబర్ 2 : జిల్లా కేంద్రంలో ఎల్ఐసీ ఆఫ్ ఇండియా 68వ ఆవిర్భావ దినోత్సవం మేనేజర్ రామచంద్రం, ఏడీఎం లక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఐడీబీఐ ఏజీఎం చంద్రమౌళి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ప్రతినిధులు తెలిపారు.
- **దరఖాస్తుల ఆహ్వానం-** మోర్తాడ్, సెప్టెంబర్2: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు, ఇంగ్లిష్, కంప్యూటర్ సైన్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల్లో గెస్ట్ లెక్చరర్‌గా పనిచేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పెద్దన్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 5 సాయంత్రం 4గంటలలోపు కళాశాలలో దరఖాస్తులను అందజేయాలని, ఈనెల 6న నిజామాబాద్‌లో ఇంటర్వ్యూలు ఉంటాయని తెలిపారు.
- **డీలర్ల నియామకానికి..** కోటగిరి, సెప్టెంబర్ 2: బోధన్ డివిజన్‌లోని కోటగిరి, బోధన్, రెంజల్, ఎడపల్లి, రుద్రూర్ మండలాల్లో ఖాళీగా ఉన్న 18 రేషన్ దుకాణాల డీలర్ల నియామకం కోసం ఆర్డీవో రాజేశ్వర్ సోమవారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఈనెల నుంచి 13లోగా బోధన్ ఆర్డీవోకార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 26న రాతపరీక్ష నిర్వహించి, డీలర్లను ఎంపికచేస్తామని పేర్కొన్నారు.
- **బాలికల వసతి గృహం తనిఖీ -** బాల్కొండ, సెప్టెంబర్ 2: మండల కేంద్రంలోని బీసీ బాలికల వసతిగృహాన్ని సోమవరం జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ స్రవంతి, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ గంగాకిషన్ సోమవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు వేడిగా భోజనం అందించాలని వసతిగృహ సంక్షేమాధికారి జయశీలను ఆదేశించారు.
- **రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడండి-** ముప్కాల్, సెప్టెంబర్ 2: రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి సోమవారం రెంజర్లలో పర్యటించారు. రైతు రూణమాఫీ సమస్యలను ఏఈవో నరేశ్‌ను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు.
- **కార్యవర్గం ఎన్నిక-** వేల్పూర్, సెప్టెంబర్ 2: మండల కేంద్రంలోని కౌండిన్య గౌడ సంఘం కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎస్.మల్లాగౌడ్, ఉపాధ్యక్షుడిగా గంధం శ్రీనివాస్‌గౌడ్, క్యాషియర్‌గా సి.దేవేందర్‌గౌడ్, సలహాదారులుగా పి.కరుణాకర్‌గౌడ్, పి.చంద్రదేవ్‌గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.
- **దళిత వాడల్లో అధికారుల సర్వే -** బోధన్ రూరల్, సెప్టెంబర్ 2: సాలూరా మండల కేంద్రంలోని దళిత వాడ కాలనీలో సోమవారం పంచాయత్‌రాజ్ ఏఈ లిఖిత సర్వే చేశారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఆదేశాల మేరకు సీసీ డ్రైనేజీ నిర్మాణం కోసం సర్వే చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ చీల శంకర్, పంచాయతీ కార్యదర్శి ప్రవీన్ తదితరులు పాల్గొన్నారు.
- **సీఎస్ఐ చర్చిలో జీడీసీసీ సేవకుల సదస్సు -** శక్కర్‌నగర్, సెప్టెంబర్ 2: బోధన్ ప్రాంతంలోని జీడీసీసీ సేవకులు ఐక్యంగా ఉంటూ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని బిషప్ ఇన్‌చార్జి, సీఎస్ఐ మెదక్ డయాసీ రూబెన్ మార్క్ సూచించారు. సోమవారం బోధన్ పట్టణం ఆచన్‌పల్లి సీఎస్ఐ చర్చిలో నిర్వహించిన జీడీసీసీ సేవకుల సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం చర్చిలో సండే స్కూల్ రెనోవేషన్‌ను లాంఛనంగా ప్రారంభించారు.
- **తాగునీటి క్లోరినేషన్ -** బాల్కొండ, సెప్టెంబర్ 2: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఎంపీవో గంగామోహన్ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో శానిటేషన్, క్లోరినేషన్ చేయించారు.

శాంతి కమిటీ సమావేశం

వినాయక్‌నగర్, సెప్టెంబర్ 2 : గణేశ్ నవరాత్రి ఉత్సవాలతో పాటు ఇతర పండుగలను అన్ని మతాల వారు శాంతియుతంగా జరుపుకోవాలని రెండో టౌన్ ఎస్సై యాసిర్ అరాఫత్ సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ ఫంక్షన్‌హాలులో గణేశ్ మండపాల నిర్వాహకులు, మతపెద్దలతో సోమవారం శాంతి కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు.

ఒరిజినల్ విక్రయ దస్తావేజు పోయినది

నా యొక్క క్లయింటు శ్రీదాసరి మల్లిఖార్జున్ తండ్రి దాసరి మాల కొండయ్య, వయస్సు, 38 సం॥లు, వృత్తి వ్యాపారము, నివాసము: ఇంటి నెం.బర్: ఎల్ ఐ జి-471, హౌజింగ్‌బోర్డు కాలనీ, కంఠేశ్వర్, నిజామాబాద్ గారి స్వంత ఆర్ సీసి రూపు ఇల్లు మరియు ఖాళీ స్థలము ఇల్లు నెం.340 ఎల్ఐజి, మున్సిపల్ నెం.11-1-ఎల్ ఐజి 340, సర్వేనెంబర్ 129, 130, 131, 150, 151, 186, 187, 188, 190, 192, 193, 194, 195, 196, 199, 202 మరియు 203 ఎల్.పి.నెం. 50/99 వార్డు నెం: (11), బ్లాక్ నెం.(1) తెలంగాణ హౌజింగ్ బోర్డు కాలనీ, కంఠేశ్వర్, నిజామాబాద్‌లో గల దాని యొక్క ఒరిజినల్ లింక్ రిజిస్టర్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.: 2619/2021 తేది.06.02.2021 (శ్రీ బాల నాయక్ తండ్రి బి.వసరాం నాయక్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హౌజింగ్ బోర్డు, నిజామాబాద్ గారు శ్రీమతి టి.గుణావతి భర్త కీ॥శే॥ టి.గంగాధర్ గారి పేరున వ్రాయించియిచ్చినది) గల డాక్యుమెంట్ నా క్లయింట్ గారు హౌజింగ్ బోర్డు, కంఠేశ్వర్, నిజామాబాద్ పరిదిలో పోగొట్టుకోవడం జరిగింది. ఈ ఆస్తికి హద్దులు ఉత్తరము: ఇల్లు నెం.341 ఎల్ఐజి, దక్షణము: ఇల్లు నెం: 339 ఎల్ఐజి, తూర్పు: 24 ఫీట్ల రోడ్డు, పడమర: ఓపెన్ ప్లాటు నెం.40 కలవు. పైన పెర్కొనబడిన దస్తావేజు ఎవరికైన దొరికినయెడల ఈ క్రింద పేర్కొనబడిన చిరునామకు అందజేయగలరని మనవి.

సం/- డి.వెంకట్‌రమణ గౌడ్, న్యాయవాది మరియు నోటరి, సుభాష్‌నగర్, నిజామాబాద్, సెల్: 9948673495

'అవసరమైతే తప్ప బయటికి రావొద్దు '

వినాయక్‌నగర్/ఆర్మూర్‌టౌన్, సెప్టెంబర్ 2 : ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయని, ప్రజలు అత్యవసరమైతే తప్పా బయటికి రావొద్దని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్